## క్లుప్తంగా

### వైద్యసేవల మెరుగుదలకు కృషి



అంగర పీహెచ్‌సీ నిర్వహణపై చర్చిస్తున్న సభ్యులు

**కపిలేశ్వరపురం:** అంగర పీహెచ్‌సీ ద్వారా వైద్య సేవలను మరింత మెరుగు పరచాలని పీహెచ్‌సీ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ప్రతినిధులు అన్నారు. అంగర పీహెచ్‌సీలో కమిటీ చైర్మన్, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వైద్యాధికారి పి.రత్నకుమారి సమావేశం అజెండా ప్రవేశపెట్టారు. అనంతరం పీహెచ్‌సీ నిర్వహణ, పాలనాపరమైన అంశాలు, మందుల నిల్వ, సేవల అందజేత తదితర అంశాలపై ప్రజా ప్రతినిధులు, పీహెచ్‌సీ అధికారులు, పలు విభాగాల ప్రతినిధులతో చర్చించారు. పలు తీర్మానాలు చేశారు. సర్పంచ్‌లు వాసా కోటేశ్వరరావు, తిరునాతి ఆదిలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు పెద్దిరెడ్డి శేషారత్నం, మేడిశెట్టి దుర్గారావు పాల్గొన్నారు.

### పట్టణ ఎస్సైగా నాగేశ్వరరావు



**రామచంద్రపురం:** పట్టణ ఎస్సైగా ఎస్.నాగేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఇద్దరు ఎస్సైలు మూడు నెలల కిందట వీఆర్‌లోకి వెళ్లారు. కాగా గతంలో ఐ.పోలవరం మండలంలో పనిచేసిన నాగేశ్వరరావు వీఆర్‌కి వెళ్లారు. ప్రస్తుతం ఆయన రామచంద్రపురం పట్టణ ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు.

### తోటపేట సర్పంచ్ కామరాజు మృతి



**రామచంద్రపురం రూరల్:** తోటపేట గ్రామ సర్పంచ్ కొల్లపు కామరాజు (63) శుక్రవారం మృతి చెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. ఆయనకు భార్య వీరపాప, కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతదేహాన్ని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్, జెడ్పీటీసీ సభ్యుడు మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, సర్పంచులు అంబటి తుకారం, యల్లమిల్లి సతీష్‌కుమారి, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, పంచాయతీ కార్యదర్శి కోట వెంకట రామకృష్ణ, వార్డు సభ్యులు కోట శ్రీనివాసరావు, అచంట వేణి, ఇళ్ల సూరిబాబు తదితరులు సందర్శించి నివాళులు అర్పించారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, శాకా బాబి సంతాపం తెలిపారు.

### అధికారుల తనిఖీలు

**మండపేట:** పర్యావరణ హితాన్ని కాంక్షిస్తూ పట్టణ ప్రజలు, వ్యాపారాలు కూడా ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా విడనాడాలని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు విజ్ఞప్తి చేశారు. ప్లాస్టిక్ నిషేధంపై ఆంక్షలు విధిస్తూ మున్సిపల్ అధికారులు శుక్రవారం పట్టణంలోని దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు సారథ్యంలో సచివాల సిబ్బంది కేపీ రోడ్డులోని వివిధ దుకాణాలు, మార్కెట్, తోపుడు బండ్ల దుకాణదారుల వద్ద తనిఖీలు చేశారు. ప్లాస్టిక్ విక్రయిస్తున్న పలు దుకాణాలపై దాడులు నిర్వహించి కవర్లు స్వాధీనం చేసుకుని జరిమానా విధించారు. ఏడిద రోడ్డు, గుమ్మిలేరు రోడ్డులోని కిళ్లీ షాపులు, హోటళ్లను తనిఖీ చేశారు.

### రీసోర్స్ పర్సన్లకు శిక్షణ

**మండపేట:** కిశోరి వికాసం ద్వారా అమలవుతున్న కార్యక్రమాలపై గ్రామస్థాయి రీసోర్స్ పర్సన్లు అవగాహన పెంపొందించుకుని గ్రామాల్లో అవగాహన కల్పించాలని సీడీపీవో గజలక్ష్మి, ఎంపీడీవో కె. సత్యనారాయణమూర్తి అన్నారు. మహిళ, శిశు సంక్షేమ శాఖ, మండపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారంరీసోర్స్ పర్సన్లకు శిక్షణ జరిగింది. గజలక్ష్మి నేతృత్వంలో జరిగిన సమావేశంలో ఎంపీడీవో ఇతర అధికారులు హాజరయ్యారు.

### నూరుశాతం ఉత్తీర్ణతకు కృషి

**కాజులూరు:** పదో తరగతి పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్ అన్నారు. కాజులూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 150 మంది విద్యార్థులకు యూటీఎఫ్‌లోని నిపుణులైన ఉపాధ్యాయ బృందంచే ముద్రించిన ఎస్ఎస్‌సీ స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం ఆయనతో పాటు, మాజీ ఎంపీపీ యాళ్ల కృష్ణారావు తదితరులు పంపిణీ చేశారు. పుస్తకాల పంపిణీకి రూ.11,250 ఆర్థిక సాయం అందించిన మండల సాగునీటి సంఘాల అధ్యక్షుడు (డీసీ) లకాని కృష్ణ చైతన్యను నాయకులు అభినందించారు.

### వృద్ధురాలి మృతి

**రామచంద్రపురం రూరల్:** వెలంపాలేనికి చెందిన తెలగాని ఆదిలక్ష్మి(68) కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందారు. ఆదిలక్ష్మి కడుపు నొప్పి, కీళ్లవాతం తదితర ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ ఈ నెల 24న రాత్రి సమయంలో చెదల మందును తాగింది. కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది.

# విద్యుత్ చార్జీల బాదుడేంటి బాబూ!

తాము అధికారంలోకి వస్తే అంత చేస్తాం.. ఇంత చేస్తామని ఎన్నికల ముందు కూటమి నేతలు ఊకదంపుడు ప్రసంగాలతో ఊదరగొట్టారు. తీరా అధికారం ఇస్తే మొండి చేయి చూపుతున్నారు.. రైతుల నుంచి అన్ని వర్గాల వారికీ కష్టాలు మిగిల్చారు. ఇది సరిపోదన్నట్టు సామాన్యుల నడ్డి విరిచేలా విద్యుత్తు చార్జీల భారం మోపారు. అసలే కుటుంబ పోషణకు అల్లాడుతున్న ప్రజలు పోరుబాటకు దిగారు. వైఎస్సార్ సీపీ పిలుపు మేరకు విద్యుత్ చార్జీల దోపిడీకి నిరసనగా శుక్రవారం రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహించారు.

- చంద్రబాబువన్నీ మోసపూరిత వాగ్దానాలే
- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ధ్వజం
- విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా పార్టీ పోరుబాట
- మండపేట పట్టణంలో భారీ ర్యాలీ
- విద్యుత్ కార్యాలయంలో వినతిపత్రం అందజేత

**మండపేట:** అధికారంలోకి వస్తే ఒక్క రూపాయి విద్యుత్ చార్జీ కూడా పెంచనని గుండెలు బాదుకుని ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ ఏమైందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రశ్నించారు. మోసపూరిత వాగ్దానాలతో కూటమి పాలకులు రాష్ట్ర ప్రజలకు నట్టేట ముంచారంటూ ఆయన ధ్వజమెత్తారు. పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం మండపేటలో నియోజకవర్గ స్థాయిలో ఆ పార్టీ శ్రేణులు పోరుబాట నిర్వహించాయి. ఎమ్మెల్సీ తోట పిలుపుతో నియోజకవర్గంలోని మూడు మండలాల నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు మండపేట తరలివచ్చారు. తోట నాయకత్వంలో వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర నేతలు రెడ్డి రాధాకృష్ణ, కర్రి పాపారాయుడు, వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, దూలం వెంకన్నబాబులతో పాటు మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ దుర్గారాణి, మూడు మండలాల జెడ్పీటీసీ సభ్యులు కుడుపూడి భవానీ, పుట్టపూడి వీరవెంకట సూర్యనారాయణ (అబ్బు), నల్లమిల్లి మంగతాయారు తదితరులతో కలసి బైక్ ర్యాలీ నిర్వహించారు. బైక్ ర్యాలీ రాజారత్న రోడ్డు, బస్ స్టాండు మీదుగా కలువపువ్వు సెంటర్‌కు చేరుకుంది. అక్కడ వైఎస్సార్‌సీపీ శ్రేణులు కొద్దిసేపు ఆందోళన చేశారు. అనంతరం కేపీ రోడ్డుమీదుగా మారేడుబాక వంతెన వరకూ బైక్ ర్యాలీ ఉత్సాహంగా సాగింది. అక్కడి నుంచి ప్ల కార్డులు చేతబూని



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పాదయాత్ర చేసుకుంటూ మారేడుబాక విద్యుత్ సబ్ స్టేషన్ వరకూ పార్టీ శ్రేణులు ప్రదర్శన చేశాయి. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సబ్ స్టేషన్‌ను ముట్టడించి ధర్నా నిర్వహించారు. కూటమి ప్రభుత్వ తీరుకు నిరసనగా పెద్ద ఎత్తున గర్జించారు. అనంతరం కార్యాలయంలో ఉన్న ఎలక్ట్రికల్ ఏఈ మునికి నాయకులతో కలసి తోట త్రిమూర్తులు వినతిపత్రం అందించారు.

ఈ సందర్భంగా తోట త్రిమూర్తులు తన ప్రసంగంలో కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. కపిలేశ్వరపురం, తాతపూడి ర్యాంపుల వద్ద స్టాక్ పాయింట్లలోని ఇసుకంతా కూటమి నాయకులు దిగమింగారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఊరూరా, వీధివీధినా కూటమి కార్యకర్తల చేత బెల్టు షాపలు పెట్టించి జేబులు నింపుకుంటున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీలు వుండమట్ల శ్రీనివాస్, మేడిశెట్టి సత్యవేణి, నౌడు వెంకటరమణ, పార్టీ నాయకులు జిన్నూరి సాయిబాబు, ముమ్మిడివరపు బాపిరాజు, అలీఖాన్‌బాబా, యరమాటి వెంకన్నబాబు, పెంకే గంగాధర్, వల్లూరి రామకృష్ణ, పలివెల సుధాకర్, జొన్నపల్లి సత్తిబాబు, శెట్టి నాగేశ్వరరావు, శిరంగు శ్రీనివాస్, కౌన్సిలర్లు, నక్కా సింహాచలం, పలివెల మధు, శిరిపురపు శ్రీనివాస్, తులా శేషారావు, మారిశెట్టి సత్యనారాయణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



మారేడుబాక సబ్‌స్టేషన్ వద్ద వినతిపత్రం సమర్పిస్తున్న తోట త్రిమూరులు, నాయకులు

### పోరుబాటుకు తరలివెళ్లిన కార్యకర్తలు

**కపిలేశ్వరపురం:** విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ మండపేటలో ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన పోరుబాట కార్యక్రమంలో పాల్గొనేందుకు కపిలేశ్వరపురం మండలంలోని 19 గ్రామాల నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యుత్ వినియోగదారులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. పలు గ్రామాల నుంచి అంగర గాంధీ సెంటర్‌కు తరలి రాగా అక్కడ నుంచి ర్యాలీగా మండపేటకు తరలివెళ్లారు. జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీటీసీ మేడిశెట్టి సత్యవేణి, ప్రజా ప్రతినిధులు గొల్లపల్లి సోనియా, వాసా కోటేశ్వరరావు, తిరునాతి ఆదిలక్ష్మి, మేడిశెట్టి దుర్గారావు, యర్రంశెట్టి నాగేశ్వరరావు, నాయకులు గూటం సత్యనారాయణ, కొండేటి వెంకటేశ్వరరావు, సలాది వీరబాబు, పాలింగి కృష్ణ కిశోర్, కట్టా మురళి, కొరిపెల్ల శ్రీను, చింతా పెద్ద కాపు, పిప్పర సంపతరావు, కుడిపూడి విజయ్, శనక్కాయల దొరబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మండపేటలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఆందోళనలో పాల్గొన్న కపిలేశ్వరపురం మండల నాయకులు

## అభివృద్ధి మరచి అరాచకాలు

**రామచంద్రపురం:** అమలు కాని హామీలను ఇచ్చి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం అభివృద్ధిని పక్కన పెట్టి అరాచకాలకు పాల్పడుతుందని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ విమర్శించారు. కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీల తగ్గించాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమాన్ని సూర్యప్రకాశ్ నేతృత్వంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ హాజరయ్యారు. తొలుత స్థానిక గాంధీపేటలోని పార్టీ కార్యాలయం నుంచి ప్రధాన రహదారి మీదుగా ర్యాలీ చేశారు. మున్సిపల్ కార్యాలయం వద్ద దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సూర్యప్రకాశ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి నేతలు విద్యుత్ చార్జీలను తగ్గిస్తామని హామీనిచ్చి ఇప్పుడు భారీగా పెంచడం సిగ్గుచేటని అన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసానికి ఇదే నిదర్శనమన్నారు. ప్రజలపై భారం మోపుతూ చంద్రబాబు అన్ని రకాలా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. అనంతరం ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు.

**సమస్యలను గాలికొదిలేసిన మంత్రి**

ప్రజా సమస్యలను మంత్రి సుభాష్ గాలికి వదిలేశారని వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ విమర్శించారు. అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి పెట్టకుండా ప్రతిపక్ష నాయకులపై కేసులు పెట్టడటం ఈ కూటమి ప్రభుత్వ చేస్తుందని, అదే విధానాన్ని మంత్రి సుభాష్ అవలంబిస్తున్నారన్నారు. నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నేతలపై మంత్రి సుభాష్ తప్పుడు కేసులను బనాయిస్తున్నారని అన్నారు. విత్తనాలు దొరక్క రైతులు ఇబ్బందులు పడుతుంటే తనకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. మంత్రి పదవిలో ఉండి అధికారులతో సమీక్ష చేయకుండా రైతులను ఆదుకోకుండా తప్పుడు కేసులు పెడుతూ హింసిస్తున్నారన్నారు. రామచంద్రపురం నుంచి అమరావతి వెళ్లడం, అక్కడి నుంచి ఇక్కడకు రావటం తప్ప ఈ నియోజకవర్గం గురించి చేసిందేమీ లేదని మండిపడ్డారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదని సూర్యప్రకాశ్ స్పష్టం చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, ఏఎంసీ మాజీ చైర్మన్ పందు గోవిందరాజు, పార్టీ నేతలు పెట్టా శ్రీనివాసరావు, గాధంశెట్టి శ్రీధర్, పెంటపాటి శ్రీను, పెమ్మిరెడ్డి మురళీ, నియోకవర్గంలోని మూడు మండలాలకు చెందిన ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



రామచంద్రపురం ప్రధాన రహదారిలో ర్యాలీ చేస్తున్న సూర్యప్రకాశ్, పార్టీ శ్రేణులు



ఏపీఈపీడీసీఎల్ కార్యాలయంలో వినతి పత్రం అందిస్తున్న సూర్యప్రకాశ్, ఎంపీ బోస్

## సమష్టి కృషితోనే అభివృద్ధి

**కాజులూరు:** అధికారులు, ప్రజాప్రతినిధుల సమష్టి కృషితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. శుక్రవారం కాజులూరు మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ మాత భారతి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీ బోస్ ముఖ్య అతిథిగా హాజరై శాఖల వారీగా సమీక్ష జరిపారు. మండలంలోని 26 గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ముందుగా శీల సర్పంచ్ కొమలి వెంకటరమణ తదితరులు మాట్లాడుతూ గ్రామాల్లో సచివాలయాల నిర్మాణాలు పూర్తి చేసినా బిల్లులు ఎందుకు మంజూరు కావడం లేదని ప్రశ్నించారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు సంబంధిత పంచాయతీరాజ్ ఏఈ శంకర్ సక్రమంగా సమాధానం చెప్పలేదని ఎంపీ బోస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు ఇలాంటి సమావేశాలకు పూర్తి సమాచారంతో రావాలన్నారు. వ్యవసాయానికి సంబంధించి సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం చెప్పేందుకు నీటిపారుదల, డ్రెయిన్స్ అధికారులు హాజరు కాకపోవటంపై ఎంపీ బోస్ అసహనం వ్యక్తం చేశారు. సమావేశానికి డుమ్మాకొట్టిన అధికారులపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చెయ్యాలని ఎంపీడీఓ జె.రాంబాబును ఆయన ఆదేశించారు. జెడ్పీటీసీ సభ్యుడు వనుం వెంకట సుబ్బారావు, తహసీల్దార్ ఎల్.శివకుమార్, వైస్ ఎంపీపీలు రేఖాడి విజయ, పెదిరెడ్డి వెంకటరమణ, ఏఓ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



కాజులూరు మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ సుభాష్ చంద్రబోస్

## సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

**రామచంద్రపురం రూరల్:** భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఎం.సావిత్రి తెలిపారు. శుక్రవారం భీమక్రోసుపాలెంలో జరిగిన సదస్సుకు రెండు అర్జీలు వచ్చాయని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ యెన్నం దేవి, ఉప సర్పంచ్ రాయుడు రమాదేవి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉంటే అఖిల భారత రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు జనుపల్లి సత్తిబాబు ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. గ్రామంలో ప్రభుత్వ స్వాధీనంలో ఉన్న సీలింగ్ భూమిని పేదలకు పంపిణీ చేయడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారని సత్తిబాబు మండిపడ్డారు. పేదలు సాగు చేస్తున్న పోరంబోకు భూములను సర్వే చేసి వారికి పట్టాలు ఇవ్వాలని, దళిత శ్మశాన వాటికకు దారి కోసం భూసేకరణ చేయాలని తదితర డిమాండ్లతో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఏఐకేఎంఎస్ గ్రామ కమిటీ నాయకులు గుండుపల్లి మంగమ్మ, విప్పర్తి సుబ్బలక్ష్మి, పోతురాజు సీత, సాధనాల బిల్లమ్మ, కొండేపూడి వీరాస్వామి, కాలుకుర్చ లీలావతి తదితరులు పాల్గొన్నారు.



భీమక్రోసుపాలెంలో తహసీల్దార్ సావిత్రికి వినతి పత్రం అందజేస్తున్న ఏఐకేఎంఎస్ నాయకుడు సత్తిబాబు

**పడమరఖండ్రికలో..**

**కపిలేశ్వరపురం:** భూ రికార్డుల్లోని సాంకేతిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ చిన్నారావు తెలిపారు. పడమర ఖండ్రికలో శుక్రవారం గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సర్పంచ్ తిరునాతి ఆదిలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో భూ యాజమానుల నుంచి అర్జీలను స్వీకరించారు. దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే దిశగా కృషి చేస్తామని తహసీల్దార్ చిన్నారావు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి శివచక్రవర్తి, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.



పడమర ఖండ్రికలో దరఖాస్తులు స్వీకరిస్తున్న సిబ్బంది

## ఉత్తమ ఫలితాల సాధనకు చర్యలు

**రామచంద్రపురం:** పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎస్‌కే సలీం బాషా ఆదేశించారు. స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జాతీయోన్నత పాఠశాలలో శుక్రవారం డివిజన్ పరిధిలోని రాయవరం, కె.గంగవరం, కపిలేశ్వరపురం, మండపేట మండలాలకు చెందిన మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సర్ప్లస్ టీచర్ల అంశంపై సమావేశం డీఈఓ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలకు కేవలం 60 రోజులు మాత్రమే ఉందని విద్యార్థులకు పాఠాలు బోధించేందుకు సబ్జెక్టు టీచర్ల కొరత ఉన్న పాఠశాలలకు సర్ప్లస్ టీచర్లను అవసరమైన విధంగా అడ్జస్ట్ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.

**మండపేట:** పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల మరింత శ్రద్ధ తీసుకుని, వారు మంచి మార్కులతో పాసయ్యేలా కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీం బాషా ఆదేశించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల సందర్శనలో భాగంగా ఆయన శుక్రవారం మండలంలోని ద్వారపూడి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను ఆయన పరిశీలించారు. పాఠశాలలోని వసతుల బాగున్నాయా? లేదా అని ఆరాతీశారు. అనంతరం ఉపాధ్యాయులతో ఆయన సమీక్ష నిర్వహించారు. బోధనా తరగతుల నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు. మండల విద్యాశాఖాధికారి నాయుడు రామచంద్రరావు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ సలీం బాషా

## మండల పరిషత్ సిబ్బంది క్రిస్మస్ వేడుకలు

**రాయవరం:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. జాతీయ గ్రామీణ ఉపాధి పథకం అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఎంపీపీ నౌడు వెంకటరమణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ వెంకటరమణ, ఎంపీడీవో కీర్తి స్పందన, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో జె.సుధారాణి కలసి కేక్ కట్ చేశారు. ఎంపీపీ వెంకటరమణ, ఎంపీడీవో కీర్తిస్పందనను ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో సుధారాణి, ఫీల్డ్ అసిస్టెంట్లు దుశ్శాలువా, పూలమాలలతో అభినందించారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది కె.మల్లికార్జునరావు, టి.వరప్రసాద్, కె.సందీప్‌రెడ్డి, జేఈఈ కనకలత, టీఏ కరుణాకర్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



మండల పరిషత్ ఆఫీసులో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ వెంకటరమణ, ఎంపీడీవో కీర్తిస్పందన తదితరులు

**క్రీస్తు బోధనలు సదా స్మరణీయం**

**కపిలేశ్వరపురం:** ఏసుక్రీస్తు బోధనలు సదా స్మరణీయమని తాతపూడి గ్రామం గోపాలరావుపేటలోని జీసస్ ప్రేయర్ హౌస్‌లో గురువారం రాత్రి నిర్వహించిన క్రిస్మస్ వేడుకలో పాల్గొన్న వక్తలన్నారు. ముఖ్య అతిథి జి.రూబెన్ మాట్లాడుతూ మానవ సమాజం వికాసానికి బైబిల్ వాక్యాలు దోహదపడతాయన్నారు. చర్చి నిర్వాహకులు రాపాక పాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలో చిన్నారులు తమ కళ, నైపుణ్యాలను ప్రదర్శించారు. గూటం రాజశేఖర్, విజయ కుమారి దంపతుల సౌజన్యంతో విద్యార్థులకు పరీక్ష అట్టలు, పెన్ను తదితర విద్యా ఉపకరణాలను అందజేశారు. కార్యక్రమంలో జీవన్ జోయ్, ప్రవీణ్ జోయ్ మాట్లాడారు.



తాతపూడిలో చిన్నారులకు పరీక్ష అట్టలు అందజేసిన నిర్వాహకులు

### మన్మోహన్‌సింగ్ మృతికి నివాళి

**మండపేట:** దేశాభివృద్ధికి ఎనలేని సేవలందించిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడతారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మాజీ ప్రధాని మృతిపై పట్టణంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, పలు రాజకీయ పార్టీల నేతలు శుక్రవారం సంతాపాన్ని తెలిపారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద ఎమ్మెల్సీ తోట సమక్షంలో పార్టీ నాయకులు కర్రి పాపారాయుడు, వేగుళ్ల పట్టాభిరామయ్యచౌదరి, రెడ్డి రాధాకృష్ణ, మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ దుర్గారాణి, ఎంపీపీలు మేడిశెట్టి సత్యవేణి, నల్లమిల్లి మంగతాయారు తదితర నాయకులు సంతాపం తెలిపారు. కొద్దిసేపు మౌనం పాటించారు. అలాగే మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. దేశం కోసం పాటపడిన మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్‌కు కేంద్ర ప్రభుత్వం భారత రత్న ఇచ్చి గౌరవించాలని ఏఐసీసీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ మండపేట ఇన్‌చార్జి కామన ప్రభాకరరావు కోరారు.



వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద మన్మోహన్ సింగ్ మృతికి సంతాపం తెలుపుతున్న నాయకులు

### పవిత్రోత్సవాలు తిలకించిన హెచ్‌ఆర్సీ చైర్మన్

**రాయవరం:** రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్, హైకోర్టు రిటైర్డ్ జడ్జి ఎం.సీతారామమూర్తి శుక్రవారం మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠాన్ని సందర్శించారు. పీఠంలో జరుగుతున్న పవిత్రోత్సవాలను తిలకించారు. తొలుతగా ఆయన పీఠంలో కొలువైన విజయదుర్గా అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం (గాడ్) ఆశీస్సులు పొందారు. పవిత్రోత్సవాలను పురస్కరించుకుని రెండో రోజు పీఠంలోని విజయదుర్గా అమ్మవారికి, విజయవేంకటేశ్వరస్వామివారికి తిరుమంజన సేవ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పీఠాధిపతి గాడ్ ఆశీస్సులు పొందారు. రాజమహేంద్రవరం అడిషనల్ ఎస్పీ (లా అండ్ ఆర్డర్) అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బారావు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, విజయదుర్గా సేవా ప్రతినిధులు గాదె భాస్కరనారాయణ, సత్యవెంకటకామేశ్వరి, పెద్దపాటి సత్యకనకదుర్గ, బలిజేపల్లి రమ, పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్ పాల్గొన్నారు.



గాడ్ ఆశీస్సులు పొందుతున్న హెచ్‌ఆర్సీ చైర్మన్ సీతారామమూర్తి